క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ సౌజన్యంతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న 75 మంది విద్యార్థులకు రూ. 60 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు శివానంద, సెక్రటరీ శ్రీనివాసులు, సభ్యులు శ్రీకాంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సెలవు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు బుధవారం నుంచి సెలవు ప్రకటించాయి. బుధవారం గాంధీ జయంతి కావడంతో నేషనల్ హాలిడే. అలాగే 3వ తేదీ నుంచి 13 వరకు దసరా సెలవులుంటాయని ఎంఈఓ నాగరాజు తెలిపారు.

గోశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఈఓ కె.వాణి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన గోశాల నిర్మాణం కోసం ఈఓ కె.వాణి మంగళవారం సిబ్బందితో కలసి స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం తూర్పు భాగంలో ఆలయానికి ఆనుకుని ఉన్న గోశాలలో గోవులు పెరగడంతో పరిస్థితి ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో నూతన గోశాల నిర్మించడానికి సిబ్బందితో కలసి ఈఓ స్థలాలను పరిశీలించారు. గోశాలలోని గోవుల కోసం పచ్చిగడ్డి పెంపకం మొదలు పెట్టాలని ఆమె సూచించారు. కాగా కసాపురం గ్రామస్తులు ఆమెను కలసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు

పెద్దవడుగూరు: దుకాణాల్లో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిన్నరెడ్డప్ప హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాల్లోని దుకాణాల్లో సిబ్బందితో కలసి ఆయన తనిఖీ చేశారు.

కూరగాయలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: మనిషి సంపూర్ణ ఆరోగ్యంలో కూరగాయల పాత్ర ఎక్కువ ఉందని కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కూరగాయల ఉపయోగాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అహారంలో కూరగయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కూరగాయలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విభాగపతి భాను ప్రసాద్, ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీకి అరుదైన గౌరవం



హర్షం వ్యక్తం చేస్తున్న కళాశాల యాజమాన్యం

గుత్తి: గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీకి అరుదైన గౌరవం దక్కింది. సౌత్ సెంట్రల్ జోన్‌లో 2024 సంవత్సరానికి గాను బెస్ట్ పెర్ఫామింగ్ ఇంజినీరింగ్ కాలేజీగా గుర్తింపు లభించింది. అకడామిక్ క్వాలిటీ, ఇన్నోవేషన్లపై అంకిత భావానికి ఏఐసీటీయూ, ఎడ్యూస్కిల్స్ ప్రతినిధులు బెస్ట్ పెర్ఫామింగ్ అవార్డు ఇచ్చారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో గేట్స్‌కు బెస్ట్ పెర్ఫామింగ్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును గేట్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ గేట్స్ కళాశాలకు అరుదైన గౌరవం దక్కినందుకు గర్వంగా ఉందన్నారు.

కట్నం కోసం వేధిస్తున్నాడని భర్తపై కేసు

యాడికి: అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని వివాహిత ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని భోగాలకట్ట గ్రామానికి చెందిన చంద్రికను ఏడాది క్రితం పెద్దపప్పూరు మండలం గార్లదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డితో వివాహమైంది. అదనపు కట్నం కావాలని భార్యతో ఆయన గొడవ పడుతుండేవాడు. ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘాటెక్కిస్తున్న ఉల్లి

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70
- కొనాలంటే జంకుతున్న ప్రజలు



యాడికి మార్కెట్‌లో ఉల్లి విక్రయాల దృశ్యం

యాడికి: ఉల్లిగడ్డ ధరలు ఘాటెక్కిస్తున్నాయి. ఒక్కసారిగా ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం హోల్ సేల్‌లో చిన్న ఉల్లిగడ్డ ధర కిలో రూ.30, పెద్ద ఉల్లిగడ్డ ధర రూ. 60 ఉండగా బయట మార్కెట్లో రూ.70 నుంచి రూ.80 వరకూ విక్రయిస్తున్నారు. ధరలు పెరగడంతో చాలా మంది ఉల్లి జోలికి పోవడం లేదు. ధరలు పెరగడంతో కూరగాయల వ్యాపారస్తులు కొద్ది రోజులుగా ఉల్లిగడ్డలను అమ్మడం లేదు. ఉల్లి వల్ల నష్టమే తప్ప లాభం లేదని ఉల్లిగడ్డ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద వ్యాపారస్తులు ఉల్లిగడ్డలను బ్లాక్ మార్కెట్ చేయడం వల్లే ధరలు పెరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మరి కొందరు ప్రభుత్వం ధరలను నియంత్రిక పోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. వేసవిలో ఉల్లి ధర కిలో రూ.20 నుంచి రూ.30 ఉండేది. ఆ సమయంలో ఉల్లి పంట రావడం వల్ల ధరలు తక్కువగా ఉంటాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. యాడికి మండలంలోని కోనుప్పలపాడు, ఓబుళాపురం, చంద్రాయుని గుడిసెలు, రెడ్డి గుడిసెలు, కత్తిమానుపల్లె గ్రామాల్లో రైతులు 350 ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేస్తున్నారని ఉద్యాన శాఖ అధికారిణి ఉమాదేవి తెలిపారు. పాలకులు స్పందించి ఉల్లి గడ్డ ధరలను నియంత్రించాలని పాలకులు కోరుతున్నారు.

ధరలను తగ్గించండి



ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి వంటలో ఉల్లిగడ్డలను వాడతాం. వీటిని తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ధరలను తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. –వెన్నపూస కాంతమ్మ, తూట్రాళ్లపల్లి

ఎవరూ కొనడం లేదు



కొద్ది రోజులుగా ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో ప్రజలు కొనడం లేదు. దీంతో నష్టాలు వచ్చి ఇబ్బందులు పడుతున్నాం. చాలా మంది కూరగాయల వ్యాపారులు ఉల్లిగడ్డలను అమ్మడం మానేశారు. –శ్రీనివాసులు, వ్యాపారి, రాయలచెరువు

ఉద్యాన పథకాలు సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం/గుత్తిరూరల్/పామిడి/గుంతకల్లు రూరల్: ఉద్యాన పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి శైలజ, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండలంలోని సంజీవపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెరికల్చర్ సహాయకుడు ఓబుల్‌రెడ్డి, ఉద్యాన సహాయకురాలు నవ్య, ప్రకృతి వ్యవసాయం సహాయకురాలు కేశవ, రాజేశ్వరి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి మండలంలోని పెద్దొడ్డి, అనగానదొడ్డి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మొహరున్నీసాబేగం, అనంతపురం ఎఫ్‌టీసీ ఏఓ శ్రీనివాసులు , ఎంపీఈఓ నాగవేణి, వీహెచ్ఏ వెంకటరమణయ్య, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా పామిడి మండలంలోని నీలూరు, తంబళ్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ లీనా వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఈఓ శ్రీనివాసరావ్, వీఏఏ చందన, ఎంపీఈఓ రామాంజనేయులు, వెటర్నరీ అసిస్టెంట్ పద్మావతి, రైతులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు మండలంలోని మొలకలపెంట, అమీన్‌పల్లిలో ఏఓ స్వాతి పొలం –పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



గుత్తిలో జొన్నలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

రైతులకు మేత జొన్నల పంపిణీ

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి, కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో రైతులకు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయశంకర్‌బాబు, డాక్టర్ లక్ష్మణ్ మేత జొన్న పంపిణీ చేశారు. మంగళవారం ఆయా గ్రామాల్లో పర్యటించిన శాస్త్రవేత్తలు కొత్త వంగడాలతో రైతులు సాగు చేసిన ఆముదం, కంది, వేరుశనగ, సజ్జ పంటలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మేత జొన్న ఏడాది పాటు 3 నుంచి 5 పశువులకు సరిపోతుందన్నారు. అనంతరం కరిడికొండలో వ్యవసాయ సామాగ్రి అద్దెకిచ్చే కేంద్రాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు అద్దెకు ఇచ్చేందుకు 10 పట్టలు, మూడు స్ప్రేయింగ్ పంపులను అందజేశారు. కార్యక్రమంలో అగ్రి, ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ భాస్కర్‌రావు, ప్రతినిధి సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ఆదుకోండి

గుంతకల్లుటౌన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ పవిత్ర ప్రజ్ఞ, రెడ్‌డ్రాప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెహమాన్ సూచించారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి బ్లడ్‌బ్యాంక్‌లో రెడ్‌డ్రాప్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 25 మందికి మెడికల్ ఆఫీసర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ అధ్యక్షుడు గులామ్ మహమ్మద్, ఉపాధ్యక్షుడు దివాకర్, కార్యదర్శి షఫీ, వివిధ రక్తదాతల సంస్థల ప్రతినిధులు ఇస్మాయిల్, రంజాన్, సురేష్, మనోహర్, మధు పాల్గొన్నారు.

పామిడి: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని సీఐ యుగంధర్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేవీవీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ కార్యక్రమానికి సీఐ పాటు జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ యూనిట్ అధికారి వెంకటనారాయణరెడ్డి, జేవీవీ మండల నాయకులు, బంగారు శీనా, ఓబిరెడ్డి, అభయ బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు షామీర్, ఉపన్యాసకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



పుట్లూరు: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు



పామిడి: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ఖాదర్‌పేట విద్యార్థులు

పుట్లూరు/పామిడి/బుక్కరాయసముద్రం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పుట్లూరు మండలకేంద్రంలోని కేజీబీవీకి చెందిన ఆరుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ మాధవి, పీఈటీ జ్యోతి మంగళవారం తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్–19 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన సాయి సమీన, రమాదేవి, గంగాహైమావతి, నాగప్రవిత, బేస్‌బాల్ విభాగంలో అస్మతతేజ, నెట్ బాల్ విభాగంలో క్రిష్ణకుమారి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థినులు బుధవారం ఏలూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే పామిడి మండలంలోని ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అండర్–14 విభాగంలో ఆర్ ప్రణయ, అండర్–17 విభాగంలో ఎం.మధుసూదన్, శ్రీహరి, డీ శ్రీలేఖ, పీ సౌమ్య రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ ఎస్ శిరీష తెలిపారు.



బుక్కరాయసముద్రం: ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయిరాలు నీరజ

అదేవిధంగా అండర్–17 విభాగంలో బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం పాఠశాలలో చదువుతున్న మదన్‌కుమార్, బ్రాహ్మణి, అండర్–14లో గణేష్‌కుమార్, శ్రావణి బాల్‌బాడ్మిటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు నవంబర్‌లో వెస్ట్ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

అవినీతి ఉద్యోగిపై ఆర్డీఓకు ఫిర్యాదు

గుంతకల్లు: అవినీతికి అలవాటుపడి ఆఖరుకు సాటి ఉద్యోగుల నుంచి సైతం లంచాలు బొక్కుతున్న జూనియర్ అసిస్టెంట్‌పై గుంతకల్లు ఆర్డీఓకు ఫిర్యాదు అందింది. గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అవినీతి బాగోతంపై సాక్షి దినపత్రికలో నాలుగు రోజుల కిందట 'జీతం బకాయిలు చెల్లింపులకు రూ.60 వేలు డిమాండ్' శీర్షిక వెలుబడిన సంగతి తెలిసిందే. ఈ కథనం మేరకు జూనియర్ అసిస్టెంట్‌పై శాఖపరమైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ధర్మ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ షాషావలి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జూనియర్ అసిస్టెంట్ తమను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టిన ఘటనల గురించి కొందరు బాధిత ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ ఉద్యోగి విడపనకల్లుకు బదిలీ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాలేదు.



జూనియర్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తున్న వీరాంజనేయులు

సంక్షిప్త వార్తలు

నేడు మద్యం విక్రయాలు బంద్

తాడిపత్రి రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మున్సిపాలిటీలో మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కమీషనర్ శివరామక్రిష్ణ హెచ్చరించారు. అలాగే పట్టణంలోని హోటళ్లు, దాబాలు తదితర వాటిల్లో మాంసాహార విక్రయాలు నిలిపి వేయాలన్నారు. చికెన్ సెంటర్లు, మటన్ స్టాల్స్, చేపలు స్టాళ్లను తెరవరాదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానాలను విధిస్తామని కమిషనర్ తెలిపారు.

లైన్‌మెన్‌కు సన్మానం

గుత్తి: గుత్తి ట్రాన్స్‌కో పరిధిలోని మిడుతూరు విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న గంగరాజు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా గుత్తి పట్టణంలోని వసుధా ఫంక్షన్ హాల్లో విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆయనకు సన్మానం చశారు.ఈ సందర్భంగా గంగరాజుతో పాటు ఈయన సతీమణిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక




జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తాడిపత్రిటౌన్: స్థానిక అరవింద పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పెద్దపప్పూరు మండలం సాయిరాం పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ భాస్కర్ తెలిపారు. అండర్–14 బాలుర విభాగం ఖోఖోలో జ్ఞానేష్, బాలికల విభాగంలో ఆఫీజా, కీర్తన, అండర్–17లో సుదర్శన్, బాలుర విభాగం అండర్ –14 విభాగం కబడీ పోటీల్లో జ్ఞానేష్, బాలికల విభాగంలో లావణ్య, దీక్షిత, జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లకు చెందిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ పొలం గట్ల విషయమై గ్రామానికి చెందిన రామాంజినమ్మ, ఖాసీంవలి వాదులాడుకున్నారు. ఈ క్రమంలో కులం పేరుతో దూషించి, పొలం గట్లు తొలగించారని బాధితురాలు రామాంజనమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఖాసీం వలి, ఆయన భార్య మహబూబ్‌బీ, కుమారుడు ఖాదర్ బాషా, కుమార్తె రెహనపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



మొహిద్దీన్ (ఫైల్)

పామిడి: పట్టణంలోని 1వ వార్డు వీధికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సీ మొహిద్దీన్(84) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతిపై పామిడి మండల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గతంలో స్థానిక జెండాకట్ట అధ్యక్షుడిగా పనిచేయడంతో.. జెండాకట్ట సభ్యులు బాధిత కుటుంబసభ్యలను పరామర్శించారు. ఆయనకు పెళ్లి అయిన నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆలయ పరిశీలన

పామిడి: పట్టణ సమీపంలోని పెన్నానదిలో వెలసిన సీతారామలక్ష్మణాంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి పరిశీలించారు. ఆలయానికి సంబంధించి భక్తాంజనేయస్వామి ఆలయంలోని స్వామి మూలవిరాట్ రాతి విగ్రహం చోరీకి గురైన విషయం పాఠకులకు తెలిసిందే. అందులో భాగంగా తహసీల్దార్ ఆలయంలో మూలవిరాట్‌ను తొలగించిన స్థలాన్ని పరిశీలించారు. స్వామివారి విగ్రహ అపహరణపై స్థానికులతో ఆరా తీశారు.

ఇల్లు ఆక్రమణపై ఫిర్యాదు

యాడికి: అన్నా, వదిన తన ఇంటిని ఆక్రమించుకున్నాడని ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు..మండలంలోని చింతలాయపల్లె గ్రామానికి చెందిన భారతి 2014లో ప్రభుత్వ గృహాన్ని నిర్మించుకుంది. ఇటీవల అన్న నాగార్జున, వదిన రాజేశ్వరి దౌర్జన్యంగా ఇల్లు ఆక్రమించుకున్నారని ఆమె ఫిర్యాదు చేసింది.

దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దాం

గుంతకల్లు: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. 3వ తేదీ అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా, 4న మహాలక్ష్మీదేవి, 5న శ్వేత వారాహి దేవి, 6న తిరుకదియార్‌అభిరామిదేవి, 7న గాయత్రీదేవి, 8న చాముండేశ్వరి దేవి, 9న సర్వసతీదేవి, 10న మహిషాసురరమర్ధిని, 11న మధుర మీనాక్షిదేవి అలంకరణలో దర్శనమిస్తారన్నారు. 12వ తేదీ దశమి రోజు శమీ దర్శనం అనంతరం వడి బాలోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా కేరళ కళాకారులచే ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఇక 13న చివరి రోజు తెప్పోత్సవంలో భాగంగా హంస వాహనంపై అమ్మవారి కొలను విహార కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు నరసింహులు, మేడం వెంకటేశ్వర్లు, పరుచూరు సత్యరంగయ్య, దేవరశెట్టి వెంకటసుబ్రమణ్యం, మేడా ప్రహ్లాద, గుంతా రమేష్‌బాబు, వెంకటసోమనాథ్ చక్కా జగన్‌మోహన్, పేరకం సురేష్‌బాబు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఈ నెల 3 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని తమిళనాడులోని సేలం, కోలార్, చిలకలూరిపేటకు చెందిన కళకారులు ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. 3న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అదే రోజు రాత్రి రాజరాజేశ్వరీదేవి అలంకారంలో వాసవీమాత దర్శనమివ్వనుంది. 4న గాయత్రీదేవి అలంకారం, 5న మధురమీనాక్షిదేవి అలంకారం, 6న గజలక్ష్మీదేవి అలంకారం, 7న అన్నపూర్ణదేవి అలంకారం, మధ్యాహ్నం అన్నదానం, 8న అష్టలక్ష్మీదేవి అలంకారం, బిందె సేవ కార్యక్రమం, 9న సరస్వతీదేవి అలంకారం, 10న మహిషాసురమర్ధినిదేవి అలంకారం, 11న భవానీదేవి అలంకారం అమ్మవారి గుండ ప్రవేశం, చండీహోమం నిర్వహించనున్నారు. తొమ్మిరోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది.

కంది పంట ధ్వంసం..రూ.లక్షకు పైగా నష్టం

గుంతకల్లు రూరల్: మండలంలోని దోసలుడుకి గ్రామంలో 1.75 ఎకరాల్లో సాగు చేసిన కంది పంటను రాత్రికి రాత్రి తొలగించారు. బాధిత రైతు రామాంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముష్టూరు గంగమ్మకు నలుగురు కుమారులు కాగా కుమారులందరికీ సమానంగా భూమి పంపిణీ చేసిన ఆమె తన పేరున ఐదు ఎకరాలను ఉంచుకుంది. ఆమె తదనంతరం ఆ భూమిని ముగ్గురు అన్నదమ్ములు చెరో 1.75 ఎకరాల చొప్పున పంచుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములు తమ భాగానికి వచ్చిన భూమిని బీడుగా వదిలేయగా రామాంజనేయులు రూ.లక్షకు పైగా ఖర్చుపెట్టి సేద్యం చేయడంతోపాటు, కందిపంటను సాగు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయాన్నే రామాంజనేయులు పొలం వద్దకు చేరుకునే సరికే పూత దశలో ఉన్న కందిపంటను పూర్తిగా తొలగించేశారు. రైతు వెంటనే కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అన్నదమ్ముల మధ్య పొలం సమస్యలు ఉండటంతో తమ్ముడు గోపాల్ ఈ పనిచేసి ఉంటాడని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశాడు.

జూదరుల అరెస్టు

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామ శివారులో పేకాట స్థావరంపై సీఐ ఈరన్న తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,250 నగదు స్వాధీనం చేసుకు న్నట్లు సీఐ తెలిపారు.

గుంతకల్లు ఆర్డీఓగా శ్రీనివాస్



శ్రీనివాసరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

గుంతకల్లు: గుంతకల్లు ఆర్డీఓగా ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డిని విజయవాడ సచివాలయానికి అటాచ్ చేశారు. ఆ స్థానంలో శ్రీనివాస్ గుంతకల్లుకు బదిలీ కాగా సోమవారం రాత్రి శ్రీనివాసులురెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

సర్వే డీటీగా దివాకర్‌రెడ్డి



గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం భూ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా దివాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎక్సైజ్ ఎస్ఐగా అస్లాం బేగ్



గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఎస్ఐగా అస్లాం బేగ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న సునీల్ కుమార్ కళ్యాణ దుర్గానికి బదిలీ అయ్యారు. అనంతపురం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న అస్లాం బేగ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అస్లాం బేగ్‌ను పోలీసు సిబ్బంది అభినందించారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

గుత్తి: పట్టణంలోని మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్టులు నిర్వహించారు. ఇందులో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఏపీ మోడల్ స్కూల్ (ప్రభుత్వం విభాగం) విద్యార్థులు సాయిధీరజ్, నందిని, హితేష్ వర్ధన్, ప్రైవేట్ విభాగంలో మహర్షి దయానంద గురుకుల పాఠశాల విద్యార్థులు దీక్షితా సాయి, వెంకటేష్, కార్తీక్ ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు దేశాయి నాగరాజు, శ్రీధర్ గౌడ్, సీతానంద అభినందించారు.

శింగనమల సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి

- ఎట్టకేలకు విధుల్లో చేరిన వైనం

అనంతపురం సిటీ: శింగనమల సబ్ పోస్ట్‌మాస్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి ఎట్టకేలకు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. శింగనమలలో ఇప్పటి వరకు పోస్ట్ మాస్టర్‌గా పని చేసిన వెంకటేశ్వర్లు గతనెల 30న ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఉద్యోగ విరమణకు ఐదు నెలలకు ముందే అనంతపురంలోని డివిజనల్ కార్యాలయంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డిని శింగనమలకు బదిలీ చేస్తూ కర్నూలు పీఎంజీ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే అతను అనంతపురంలోనే ఉండాలని భావించి శింగనమలకు వెళ్లకుండా బదిలీ ఉత్తర్వులు రద్దు చేయించుకునేందుకు పావులు కదిపారు. సోమవారం రాత్రి బాగా పొద్దుపోయే వరకూ తన ప్రయత్నాలు కొనసాగించారు. ఈ విషయం బయటకు పొక్కడం, పోస్టల్ ఏఎస్పీని రాత్రికి రాత్రే ‘సాక్షి’ వివరణ కోరింది. భయపడిన అధికారులు తమ ఆలోచనలను విరమించుకొని రిటైర్డ్ అయిన వెంకటేశ్వర్లు నుంచి బాధ్యతలు చేపట్టినట్లు ఆయన ఇంటికి రాత్రే వెళ్లి సంతకాలు తీసుకున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం: పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నంపల్లిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు, వీధి దీపాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఎంపీపీ సునీత, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ తజోత్స్న, పసుపుల శ్రీరామిరెడ్డి, స్పెషలాఫీసర్ శ్రీదేవి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఏపీఎం నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.